క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నార్త్ కేబిన్ వైపు రైలు పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడికి సంబంధించిన వారు ఎవరనేది తెలియలేదు. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడు పసుపు పచ్చచొక్కా, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, 94400627546, ఎస్ఐ వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్ పేటకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (40) అప్పుల బాధ భరించలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

సాయినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు బుధవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57,440 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



గుంటూరు ఈస్ట్: హత్య కేసులో ఇద్దరు నిందితులను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్ఓ నరేష్‌లు బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీనివాసరావుతోటలో మంగళవారం షేక్ మహబూబ్ సుభానీని అతని తల్లి జరీనాబేగం, ఆమె ప్రియుడు షేక్ చిన్నబాజీ కలిసి రోకలి బండతో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం షేక్ చిన్నబాజీ, జరీనాబేగంలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోపు నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఎస్‌హెచ్ఓతోపాటు, సిబ్బందిని అభినందించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుగుంట సెంటర్‌లో ముప్పాళ్ల శివన్నారాయణ మద్యం సీసాలు తరలిస్తుండగా బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి నాలుగు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న మహిళ అరెస్టు

రేషన్ బియ్యం తరలిస్తున్న మహిళపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కోదండరామ 4వ లైనులో ముళ్లపూడి రమణ అనే మహిళ రేషన్ బియ్యం తరలిస్తుండగా, బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆమె నుంచి 70 కేజీల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ విద్యార్థుల్లో నైపుణ్య శిక్షణకు ఒప్పందం



గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కల్పించేందుకు వైజాగ్‌కు చెందిన సీఎస్‌సీ అకాడమీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై. రామ్‌మోహన్‌రావు మాట్లాడారు. డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ రీసెర్చ్, డేటా మేనేజ్‌మెంట్, డీఎన్ఏ డీ–కోడింగ్ రంగాల్లో సర్టిఫికెట్ కోర్సు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం వల్ల ఫార్మసీ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్ కోర్సుల సిలబస్‌ను వివిధ విశ్వవిద్యాలయాల్లోని నిపుణుల సమన్వయంతో తయారు చేసినట్లు వివరించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.

ఏ తలుపు తట్టినా సంక్షేమ ఫలాల స్వరమే..

ఎమ్మెల్యే ముస్తఫా



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ఏ తలుపు తట్టినా సంక్షేమ ఫలాల స్వరమే వినపడుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 57వ డివిజన్ మద్దిరాల కాలనీలో బుధవారం 'సిద్ధం' యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నియోజకవర్గంలో 90 శాతం అన్ని కుటుంబాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. గడప గడపకు తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని విస్మరిస్తే, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ బాధ్యతల్ని భుజాన వేసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు.

రాజకీయంగా వైఎస్సార్ సీపీని ఎదుర్కొనలేక లేనిపోని అభాండాలు వేస్తూ చౌకబారు రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు అన్ని వేళలా కృషి చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలబడుతున్న తనను ఇంటి పెద్దలా ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. కచ్చితంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారానే సంక్షేమ ఫలాలు చెక్కు చెదరకుండా ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం



శంకుస్థాపన చేస్తున్న నూరిఫాతిమా, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 10వ డివిజన్ సుద్దపల్లిడొంక జెండా చెంటు వద్ద నుంచి రూ. 2 కోట్లుతో బుధవారం చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో 95శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగతావి కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మీరావలి, అబీద్‌బాషా, పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు రామచంటి భాస్కర్, పున్నారావు, సూరిబాబు, రాంబాబు, మజీద్, మణికుమార్, సుబ్బు, కడియాల శ్రీనివాస్, పద్మ, శాంతి, లక్ష్మి, మున్ని, బాషా, తలారి రాము, సత్యం పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్యసురక్ష

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం పేదలకు ఒక వరం లాంటిదని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 50, 53వ డివిజన్లలో బుధవారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు సాల్మన్, కిరణ్, హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

కాలిలో గడ్డ కట్టిన రక్తాన్ని పెనుంబ్రా పరికరం ద్వారా తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరెడ్డి

గుంటూరు మెడికల్: కాళ్లల్లో రక్తనాళాలు గడ్డకట్టి తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి అత్యాధునిక వైద్య పద్ధతిలో అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడినట్లు శ్రీ హాస్పిటల్‌కు చెందిన ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి చెప్పారు. అరండల్‌పేట డొంక రోడ్డులోని హాస్పిటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన 43 సంవత్సరాల వ్యక్తి కాళ్లు వాపు, నొప్పి, నడవలేకపోవడం, ఇతర అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం తమ హాస్పిటల్‌కు వచ్చినట్లు వెల్లడించారు. వ్యాధిని డీప్ వీనస్ త్రాంబోసిస్‌గా పిలుస్తారన్నారు. ఇది ఉన్నవారికి ఒక్కోసారి గుండె ఆగిపోయే ప్రమాదం ఉందని, పల్మనరీ త్రాంబోలిజం వచ్చే అవకాశం ఉన్నట్లు చెప్పారు. కాలిలో రక్తనాళాలు గడ్డకట్టడం ద్వారా వచ్చిన వీనస్ త్రాంబోసిస్ సమస్యను ఈనెల 3న త్రాంబోస్ సెక్షన్ చేసి గడ్డలు తొలగించామని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్ మొట్టమొదటిసారిగా శ్రీ హాస్పిటల్‌లో చేసినట్లు డాక్టర్ నారాయణరెడ్డి చెప్పారు. ఆపరేషన్ చేసిన రెండురోజుల్లోనే కాలిలో నొప్పి, వాపు తగ్గి సదరు వ్యక్తి నడిచినట్లు వెల్లడించారు. గతంలో ఇలాంటి ఆరోగ్య సమస్యకు హెపారిన్ ఇంజక్షన్ చేసేవారని, తద్వారా 30 శాతం రికవరీ మాత్రమే ఉండేదన్నారు. గుంటూరు ప్రజలకు అత్యాధునిక కార్డియాలజీ సేవలను అందించేందుకు తాము మొట్టమొదటిసారిగా పెనుంబ్రా అనే అత్యాధునిక వైద్య పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. దీని ద్వారా కాలి నరాల్లో రక్తపు గడ్డలను అతి తక్కువ సమయంలో తొలగించి, గుండెపోటు రాకుండా కాపాడవచ్చని వివరించారు.

చదువుతో పాటు సామాజిక పరిశీలన కీలకం




విద్యార్థులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రామకృష్ణమూర్తి, పీఎం ప్రసాద్, అధ్యాపకులు

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక పరిశీలన కీలకమని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఇంటర్మీడియెట్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ లీలా మోహన్‌రావు పోటీల్ని ప్రారంభించారు. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలంటే ఇటువంటి పోటీల్లో పాల్గొని అనుభవాన్ని గడించాలని తెలిపారు. చదువుతోపాటు సామాజిక పరిశీలన కూడా చాలా అవసరమని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులంతా పోటీల్లో పాల్గొనడం ద్వారా జీవితంలో మంచి స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కళాశాల అలైడ్ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 22 జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్విజ్, వక్తృత్వంలో పోటీల్ని నిర్వహించారు. క్విజ్ పోటీల్లో తెనాలి వైష్ణవి జూనియర్ కళాశాల, గుంటూరులోని టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, వక్తృత్వంలో తెనాలి వైష్ణవి కళాశాల, నల్లపాడులోని సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు బహుమతులు గెలుపొందారు. కళాశాల ఇంటర్మీడియెట్ విభాగ ఇన్‌చార్జ్ డాక్టర్ మంజుశ్రీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక



గురువు రత్నారెడ్డి దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత గురువులు

గుంటూరు ఎడ్యుకేషన్: అర్ధ శతాబ్దం తరువాత స్వర్ణోత్సవ కలయిక నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు ఒకనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఆత్మీయంగా సత్కరించుకున్న సంఘటన గుంటూరు నగరంలో జరిగింది. యాభై ఏళ్ల కిందట నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బుధవారం గుంటూరు నగరంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో విందులు, వినోదాలతో కాలక్షేపం చేయకుండా జీవితపు చివరి అంచులకు చేరిన తమ గురువును వెతుక్కుంటూ వెళ్లి ఘనంగా సత్కరించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో 1973–76 బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులుగా స్థిరపడ్డారు. మరికొంతమంది అనేక ఉన్నత పదవుల్లో పని చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న వారంతా తొలుత ఉభయ కుశలోపరి నిర్వహించారు. తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం విద్యానగర్‌లో శేషజీవితం గడుపుతున్న రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వై.రత్నారెడ్డి దంపతులను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంజుల సత్యనారాయణరెడ్డి, వెంకట్రావు, కృపానందం, నరసింహారెడ్డి, నాగరాజు, శౌరమ్మ, చిన్నమ్మ, ఉషారాణి, కృపారావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, అప్పారావు, జార్జి, గాలిబు, హనుమంతరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఓటరు మార్పు, చేర్పులపై అశ్రద్ధ వద్దు

అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓటరు మార్పు, చేర్పు, తొలగింపుల దరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ)లు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గ బీఎల్ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఓటరు తుది జాబితా అనంతరం నూతన ఓటు నమోదు, మార్పుల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని బీఎల్ఓలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. తొలగింపు దరఖాస్తులు వస్తే జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తప్పనిసరిని తెలిపారు. ఓటర్ల వివరాలు తుది జాబితాలో సక్రమంగా వచ్చే వరకు బీఎల్ఓలదే బాధ్యతని, అనధికారికంగా సెలవులు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, కేంద్రంలో మౌలిక వసతులపై సూపర్వైజరీ అధికారి, ఏఈఆర్ఓలకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్ఓలు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు, సూపర్వైజరీ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థినికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థి దొడ్డ భార్గవి పరిశోధనకు గానూ తమ యూనివర్సిటీ బుధవారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. 'డిజైన్, సింథసిస్ ఆఫ్ నోవెల్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ బేస్డ్ ఆన్ సాక్యుబిట్రిల్, పైపరజిన్ అండ్ ఇండజోల్ మోయిటీస్ అండ్ దేయిర్ బయలాజికల్ యాక్టివిటీస్' అనే అంశంపై భార్గవి పరిశోధన చేసిందని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పొందిన దొడ్డ భార్గవి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ)లో పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోషిప్‌కు సైతం ఎంపికైందని వెల్లడించారు.

ముగిసిన యజుర్వేద పారాయణ మౌఖిక పరీక్ష



పెదకాకాని: శివాలయంలో ఖాళీగా ఉన్న కృష్ణ యజుర్వేద పారాయణం ఉద్యోగానికి బుధవారం జరిగిన మౌఖిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర దేవదాయ శాఖ నియమించిన కమిటీ సభ్యులైన వెంకట రామకృష్ణశర్మ(రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, నెల్లూరు), కె త్రినాథ కళ్యాణ చందు(శ్రీకాళహస్తి దేవస్థానం) ఆధ్వర్యంలో, రాష్ట్ర దేవదాయ శాఖ ఏడీసీ టి. చంద్రకుమార్, సత్యనారాయణమూర్తి, ఆలయ ఈవో ఎస్. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. మొత్తం 55 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు 43 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు సంబంధించి ఉత్తీర్ణత చెందిన అభ్యర్థి పేరును రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించి తదుపరి వెల్లడించడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్ రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ అవసరం

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రానున్న 10 రోజుల్లో పారిశుధ్య పనుల్లో మార్పు రావాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించాలని సూచించారు. కమిషనర్ చాంబర్‌లో బుధవారం ప్రజారోగ్య విభాగ, ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో పారిశుధ్య పనులు, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, తరలింపులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతి రోజు సచివాలయం పరిధిలో పర్యటించి, పారిశుధ్య పనులు సమగ్రంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎక్కడైనా కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారీగా పారిశుధ్య కార్మికుల రేషనలైజేషన్ జరగాలని, ప్రధాన రోడ్లు, డ్రైన్ల పూడికతీత, ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులకు బాధ్యతలు కేటాయించాలని ఎస్ఎస్‌లను ఆదేశించారు. ఈ–ఆటోలు ఉన్న ప్రాంతాల్లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి వేరుగా జరగాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో రోడ్లపై, కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు శానిటరీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నగరంలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్లను, టెర్రస్, కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన కోకో పిట్‌ను అందించాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపట్టడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎంఓహెచ్, ఎంహెచ్ఓలను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల కోసం కేటాయించిన ట్రాక్టర్లు, కాంపాక్టర్లు, ఈ–ఆటోలకు జీపీఎస్, డంపింగ్ యార్డ్‌ల వద్ద సీసీ కెమెరాల విజువల్స్ వచ్చేలా అధునాతన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. పొన్నూరు రోడ్డులో జీటీఎస్ వద్ద నూతన వే బ్రిడ్జిని నిర్మించాలని ఎస్ఈకి సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న జీటీఎస్‌ల నిర్మాణ పనులను వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వెహికిల్ షెడ్‌లోని వాహనాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని, నగరంలో పారిశుధ్య పనుల కోసం ఎక్కడ అవసరం ఉన్నా వెంటనే సంబంధిత వాహనాన్ని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్, ఈఈ కొండారెడ్డి, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కమిటీ సమావేశం గుంటూరులోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ మండల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయాలని తెలిపారు. యువకులు ఎక్కువమంది ప్రధాని నరేంద్ర మోదీని అభిమానిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు పెట్టి బీజేపీకి ఓటు వేసే విధంగా విజ్ఞప్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటుచేసి చైతన్యవంతుల్ని చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌కి తప్పనిసరిగా ఒక వ్యవస్థను తయారు చేసి దాని ద్వారా మానిటరింగ్ చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. అందరిని కలుపుకొని వెళితే కచ్చితంగా ఎన్నికల్లో విజయ కేతనం ఎగరేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్యనాయుడు, కొక్కెర శ్రీనివాస్, కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, వై.వి. సుబ్బారావు, డాక్టర్ శనక్కాయలు ఉమాశంకర్, కంతేటి బ్రహ్మయ్య, కన్నా రవి దేవరాజ్, దర్శనం శ్రీనివాస్, కటారి వాసు దేవనాయుడు, పద్మనాభం పాల్గొన్నారు.

మట్టిపెళ్లల కింద ఆగిన ఊపిరి

- తెనాలిలో పైపులైను మరమ్మతులు చేస్తుండగా పడిన మట్టి పెళ్లలు
- మున్సిపల్ తాత్కాలిక కార్మికుడి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

తెనాలి రూరల్: మంచినీటి పైపులైను మరమ్మతులు చేస్తుండగా మట్టి పెళ్లలు మీద పడి మున్సిపల్ తాత్కాలిక కార్మికుడు మృతి చెందిన సంఘటన స్థానిక ఐతానగర్ ఎస్‌బీఐ వద్ద బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక బెరాకా చర్చి సమీపంలో మంచినీటి పైపులైను లీకేజీ అవుతుండటంతో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. వాటర్ పైపులైను లీకుల రిపేరు నిమిత్తం పొక్లెయిన్‌తో మట్టి తవ్వకాలు జరుపుతుండగా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన అయినంపూడి వెంకటేశ్వర్లు మీద మట్టి పెళ్లలు రెండుసార్లు వెంట వెంటనే పడటంతో మట్టిలో పూడుకుపోయాడు. మీద మట్టిపెళ్లలు పడటంతో ఊపిరి ఆడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుతో పాటు పనిచేస్తున్న వరికుంట ఏసుదాసుకు గాయాలు కాగా ప్రాణాలతో బయటపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు పరిస్థితి చూసి స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొన్న అంబులెన్స్ సిబ్బంది తమ వంతు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. అయినంపూడి వెంకటేశ్వర్లు తెనాలి మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. టూ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లముందే కూరుకుపోయాడు

వాటర్ పైపులైను లీక్ అవుతుండటంతో ఉదయం పనులు నిమిత్తం పొక్లెయిన్‌తో గుంట తవ్వుతుండగా కిందకి దిగి తామంతా సరి చేసే క్రమంలో మట్టి పెళ్లలు ఒక్కసారిగా వెంకటేశ్వర్లుపై పడటంతో తాము తొలగించే ప్రయత్నం చేస్తుండగా మరోసారి పడటంతో తమ కళ్లముందే మట్టిలో కూరుకుపోయాడని, ఎంత ప్రయత్నించినా లాగలేకపోయామని తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, కమిషనర్ బి. శేషన్న ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంకటేశ్వర్లుకు తక్షణ సాయం కింద రూ. 25 వేలు అతని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న ఎస్‌హెచ్ఓ విజయచంద్ర

గుంటూరు ఈస్ట్: మతి స్థిమితం లేని బాలుడు పాఠశాల నుంచి తప్పిపోగా పట్టాభిపురం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగడిగుంటకు చెందిన ఎం.ఫణి అనే 16 సంవత్సరాల మతి స్థిమితం లేని బాలుడు జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య పాఠశాలకు వెళ్లి తప్పిపోయాడు. పట్టాభిపురం పీఎస్ కానిస్టేబుల్ భూపతి ఎస్వీఎన్‌కాలనీ పదో లైనులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌హెచ్ఓ విజయచంద్ర బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.